నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 29 మే 2024 | MAHABUBNAGAR NARAYANPET

మహబూబ్‌నగర్‌లో సురవరం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సంఘసంస్కర్త సురవరం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 28 : సురవరం ప్రతాపరెడ్డి మహోన్నతుడని, తాను ఏనాడూ ఆయన కుటుంబం కోసం పనిచేయలేదని.. సమాజం బాగు పడాలన్న ఉద్దేశంతో అడుగులు వేశారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం సురవరం జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మావతీ కాలనీలోని గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న విగ్రహానికి ప్రతాపరెడ్డి కుటుంబ సభ్యులు సురవరం కపిల్, నివేదితతో పాటు పలువురితో కలిసి శ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వైతాళికుడిగా సురవరం గుర్తింపు పొం దాడని గుర్తు చేశారు. ఆయన జీవిత చరిత్రను నేటి సమాజానికి తెలియజేయాలన్నారు. సమాజం బాగే తనకు ముఖ్యమని, తన ఆస్తులు కాదని త్యాగం చేసిన గొ ప్ప మేధావి అని కొనియాడారు. తెలంగాణ సాహిత్యానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ప్రజలను చైతన్యం చేయడంలో కీలక పాత్ర పోషించిన సంఘ సంస్కర్త అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి డైరెక్టర్ మల్లు నర్సింహారెడ్డి, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, కౌన్సిలర్లు గణేశ్, అనంతరెడ్డి, ప్రవీణ్, లక్ష్మణ్, గిరిధర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్ యా దవ్, నవకాంత్, కరుణాకర్‌గౌడ్, సతీశ్ పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

మహబూబ్‌నగర్ ఆర్టీఏ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్

- ఏజెంట్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు
- ఎవరైనాఅ వినీతికిపా ల్పడితే సమాచారం ఇవ్వండి
- ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ పిలుపు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మే 28 : రవాణా శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా ఏసీబీ రేంజ్ డీఎస్పీ కృష్ణగౌడ్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం బండమీదిపల్లిలోని మహబూబ్‌నగర్ జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (రవాణా శాఖ) కార్యాలయంలో డీఎస్పీ కృష్ణగౌడ్ తన సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్ విషయంలో బయటి వ్యక్తులతో కలిసి అవినీతికి పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అందుకే కార్యాలయంలో అన్ని విభాగాల దస్త్రాలు, ఫైల్స్‌ను పరిశీలించి తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రైవేట్ వ్యక్తులైన లతీఖ్, అతీఖ్ అనే ఇద్దరు ఏజెంట్లను పట్టుకోవడం జరిగిందన్నారు. అలాగే డ్రైవింగ్ ట్రాక్ వద్ద రమేశ్ అనే వ్యక్తి వచ్చి కారు అద్దెకు పెట్టి టెస్టు డ్రైవింగ్‌కు వచ్చిన వారితో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించి అతడిని కూడా రెడ్ హ్యాండేడ్‌గా పట్టుకున్నట్లు ప్రకటించారు. ఉద్యోగులు కూడా నగదు బదిలీలు అనుమానస్పదంగా ఉండడంతో వాటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రవాణాశాఖ కార్యాలయంలో ఎవరైనా లైసెన్స్, రిజిస్ట్రేషన్ విషయంలో డబ్బులు అడిగితే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఓ సీనియర్ అసిస్టెంట్, కానిస్టేబుల్‌తోపాటు 10మంది ఉద్యోగులను విచారించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి నగదు పట్టబడలేదని, శాఖాపరంగా జరిగిన లావాదేవీలకు సంబంధించిన డబ్బులు అంతా సక్రమంగా ఉన్నాయని వివరించారు.

తిరుమల్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి

అయిజ : ఉత్తనూర్‌లోతి రుమల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్నఅల ంపూర్ ఎమ్మెల్యే విజయుడు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- ఘనంగాతి రుమల్‌రెడ్డి జయంతివేడు కలు
- పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు,అ భిమానులు

అయిజ, మే 28 : నడిగడ్డ ప్రజానాయకుడు దివంగత నేత ఉత్తనూర్ పులకుర్తి తిరుమల్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. 40 ఏండ్లు నడిగడ్డ అభివృద్ధికి తిరుమల్‌రెడ్డి శక్తి వంచన లేకుండా కృషి చేశాడన్నారు. నాయకులు, కార్యకర్తలకు అహర్నిశలు అందుబాటులో ఉంటూ ఎంతో సేవచేశాడని కొనియాడారు. మంగళవారం మండలంలోని ఉత్తనూర్ గ్రామంలో పులకుర్తి తిరుమల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే విజయుడు తిరుమల్‌రెడ్డి సతీమణి, అలంపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ సువర్ణమ్మతో కలిసి తిరుమల్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమల్‌రెడ్డి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఉమ్మడి జిల్లా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ప్రజలకు ఎన్నో సేవలందించారన్నారు. అయిజ మండలాభివృద్ధే ధ్యేయంగా పని చేశాడన్నారు. తిరుమల్‌రెడ్డి మన మధ్యలేకపోయినా ఆయన జ్ఞాపకాలు పదిలంగా ఉన్నాయన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువండి

ప్రమాదాల బారినపడుతున్న క్షతగాత్రులకు రక్తం దానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు యువతకు పిలుపునిచ్చాడు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో తిరుమల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంకాపురం రాముడు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించగా దాదాపు 240మంది రక్తం దానం చేశారు. అనంతరం మండలంలోని 10జెడ్పీహెచ్ఎస్‌లల్లో పదో తరగతిలో మొదటి, ద్వితీయ గ్రేడ్లు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఎమ్మెల్యే సన్మానించి, తెలుగు, ఇంగ్లిష్ నిఘంటువులను అందజేశారు. అంతకుముందు జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశా రు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాల నర్సింహులు, నాయకులు సీఎం సురేశ్, రామచంద్రారెడ్డి, నర్సింహారెడ్డి, పల్లయ్య, త్రివిక్రమ్‌రెడ్డి, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మే 28 : బాల సదనంలోని ఆశ్రమం పొందుతున్న ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని మెట్టుగడ్డ ప్రాంతంలో జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల సదనంలో అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన మానస, అక్షిత కొన్ని రోజులుగా ఆశ్రయం పొందుతున్నారు. సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో వీరిద్దరూ పారిపోయినట్లు బాలసదనం ఇన్‌చార్జి యాదమ్మ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

గద్వాల జిల్లా దవాఖానలోని ప్రసూతి వార్డు, (ఇన్‌సెట్లో న్యూట్రిషన్ కిట్‌లోని వస్తువులు)

కిట్.. ఫట్..!

- కేసీఆర్ కిట్ పేరు మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- నాలుగు నెలలుగా ప్రసవ మహిళలకు అందని వైనం
- జిల్లాలో జనవరి నుంచి నేటి వరకు 6,913 ప్రసవాలు
- న్యూట్రిషియన్ కిట్ బంద్‌తో గర్భిణుల ఇక్కట్లు

గద్వాల, మే 28 : సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచి మాతా, శిశుమరణాలు తగ్గించాలనే ఆలోచనతో కేసీఆర్ ప్రభుత్వం 2017లో కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఒక్కో కిట్‌లో 16 రకాల వస్తువులు ఉండేవి. ప్రసవం అనంతరం బాలింతలకు ఈ కిట్లను అందించడంతో ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. ఈ కిట్ల పంపిణీ తర్వాత జిల్లాలో 55 శాతానికిపైగా డెలివరీలు ప్రభుత్వ దవాఖానల్లోనే జరిగేవి. కాన్పుల అనంతరం బాలింతలకు ఈ కిట్లను అందజేసేవారు. ప్రసవించిన మహిళలకు చేయూత నివ్వాలన్న గత ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. కిట్లు కాంగ్రెస్ పభుత్వ హయాంలో అటకెక్కాయి. బాలింతలు, గర్భిణులకు ఇచ్చే కిట్లకు ప్రభుత్వం బ్రేక్ వేసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇవి నిలిచిపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

న్యూట్రిషన్ కిట్‌కూ మంగళం

గర్భిణులకు బలమైన ఆహారం అందించడంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్‌ను కూడా అందించింది. రేవంత్ ప్రభుత్వం రావడంతో ఈ పథకం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కిట్ అందకపోవడంతో పలువురు అవస్థలు పడుతున్నారు. ప్రసవించిన తర్వాత ఇంటికి వెళ్లే సమయంలో దవాఖానలో కిట్ గురించి అడిగితే వచ్చినప్పుడు ఇస్తామనే నిర్లక్ష్య సమాధానమే తప్పా వారికి అందించిన దాఖలాల్లేవు. ప్రభుత్వం ఇస్తున్న కిట్ల పేరును కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిందే తప్పా. అందులో పురోగతి కనిపించడం లేదు. ప్రస్తుతం ఇస్తున్న కేసీఆర్ కిట్స్‌ను మాతా శిశు సంరక్షణ కిట్‌గా (ఎంసీహెచ్) పేరు మార్చింది. పేరు మార్చినా ప్రసవించిన మహిళలకు కిట్లు అందించకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరు మార్పుపై ఉన్న శ్రద్ధ ఈ ప్రభుత్వానికి కిట్లు, న్యూట్రిషన్ ఫుడ్ అందించడంలో లేదని బహిరంగంగా ఆరోపిస్తున్నారు. నాటి ప్రభుత్వంలో ఈ రెండు పథకాలు పేదలకు వరంగా మారగా.. నేటి రేవంత్ సర్కారు హయాంలో ఉట్టిగానే మిగిలిపోయాయి.

ఐదు నెలల్లో 6,913 ప్రసవాలు.. ఒక్క కిట్ ఇయ్యలే..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 2024 జనవరి ఒకటి నుంచి ఈనెల 22 వరకు 6,913 ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లో జరిగాయి. అయితే ఇప్పటి వరకు ఒక్క బాలింతకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కిట్లు అందించలేదు. ప్రసవం తర్వాత వారి ఖర్చుల నిమిత్తం అందించే నగదును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదు. సుమారు రూ.2 కోట్లపైనే చెల్లించాల్సి ఉంటుందని వైద్యాధికారులు చెబుతున్నారు. పురుడు కోసం ప్రభుత్వ దవాఖానలకు గర్భిణులు వస్తున్నా వారికి ఇచ్చే ప్రోత్సాహకాలు మాత్రం ఇవ్వకపోవడంతో ప్రభుత్వ తీరుపై గర్భిణులు, బాలింతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ సర్కారు ప్రారంభించిన ఈ పథకాలు ఆదరణ పొందగా.. నేడు పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. కేసీఆర్ కిట్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు నాలుగు విడుతలుగా రూ.12 వేలు అందించేవారు. ఆడపిల్ల పుడితే అదనంగా మరో వెయ్యి ఇచ్చేటోళ్లు.. మహిళ గర్భిణి అయిన నాటి నుంచి ఐదు నెలల లోపు వైద్యుల పరీక్ష అనంతరం రూ.3 వేలు, ప్రసవ సమయంలో ఆడశిశువైతే రూ.5 వేలు, మగశిశువైతే రూ.4వేలు, వ్యాధి నిరోధక టీకాల సమయంలో రూ.3 వేలు, పుట్టిన బిడ్డకు పది నెలలు నిండిన తర్వాత మిగిలిన నగదును ఇచ్చేవారు. ఈ నగదు బదిలీ గర్భిణులు, బాలింతల వ్యక్తిగత ఖాతాలో జమ చేసేవారు. ఇది కూడా ప్రస్తుతం నిలిచిపోయింది. బాలింతలకు ప్రసవ అనంతరం కిట్లు ఇవ్వకపోగా, గర్భిణులకు అందించే న్యూట్రిషన్ కిట్లను నాలుగు నెలలుగా ఇవ్వడం లేదు. గర్భిణుల్లో రక్తహీనతను నివారించడానికి ప్రవేశ పెట్టిన ఈ పథక లక్ష్యం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరుగారిపోతుంది.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాలింతలకు ఇచ్చే కిట్లతోపాటు గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందించాలని మహిళలు కోరుతున్నారు.

బలవర్ధక ఆహారం ఇయ్యలే..

గద్వాల జిల్లా దవాఖానకు రాగా సుఖ ప్రసవం జరిగింది. అయితే కేసీఆర్ ప్రభుత్వం గర్భిణుల్లో రక్తహీనత తగ్గించి తల్లీబిడ్డ ఆరోగ్యంగా పుట్టాలనే ఆలోచనతో న్యూట్రిషన్ కిట్ అందించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కిట్లు బంద్ చేశారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఎందరో రక్తహీనతతో బాధపడుతుంటారు. ఒక్కోసారి ప్రసవ సమయంలో ఇబ్బందులు తప్పవు.. అంతటి ముఖ్యమైన కిట్లు నాలుగు నెలలుగా ఇవ్వడం లేదు. దీంతోపాటు కేసీఆర్ కిట్లకు మంగళం పాడారు. అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదని, వచ్చాక అందిస్తామని చెబుతున్నారు. గతంలో దవాఖాన నుంచి ఇంటికెళ్లే సమయంలో కిట్‌తో వెళ్లేటోళ్లం.. నేడు ఒట్టి చేతులతో వెళ్తున్నాం..

– మాధవి, శనగపల్లి, ఇటిక్యాల మండలం, జోగుళాంబ గద్వాల జిల్లా

కాన్పు జరిగినా కిట్ ఇవ్వలేదు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో నాకు ప్రసవం జరిగింది. నాలుగు నెలలుగా న్యూట్రిషన్ ఫుడ్ ఇవ్వలేదు. ప్రసవించిన తర్వాత కిట్ ఇయ్యలేదు. అడిగితే పై నుంచి రాలేదు.. వచ్చిన తర్వాత ఇస్తామని చెబుతున్నారు. అవి ఎప్పుడు వస్తాయో.. ఆ దేవుడికే తెలియాలి. గత ప్రభుత్వం నేను గర్భిణిగా ఉన్న సమయంలో న్యూ ట్రిషన్ ఫుడ్ ఇవ్వడంతో పాటు వైద్య ఖర్చుల కోసం విడుతల వారీగా ఖాతాలో నగదు జమచేసేవారు. ప్రస్తుతం అది లేదు.. ఇది లేదు.

– మునేశ్వరి, పాల్వాయి, మల్దకల్ మండలం

ప్రభుత్వానికి నివేదించాం

గద్వాల జిల్లా దవాఖానలో ప్రసవాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రసవ అనంతరం కిట్లు ఇవ్వాలని బాలింతల బంధువులు అడుగుతున్నారు. అయితే ప్రస్తుతం కిట్లు అందుబాటులో లేవు. సరఫరా చేయాలని ప్రభుత్వంతోపాటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల కు నివేదిక పంపాం. వచ్చిన వెంటనే అందరికీ కిట్లు అందజేస్తాం. ఎవరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు.

– నవీన్‌క్రాంతి, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్


వనపర్తిలోసు రవరం ప్రతాపరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

తెలంగాణ వైతాళికుడు ప్రతాపరెడ్డి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ఘనంగా సురవరం ప్రతాపరెడ్డి జయంతి

వనపర్తి, మే 28 : తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అని అలాంటి మహనీయులను చరిత్ర ఎన్నడూ మరవదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణంలోని సురవరం పార్కు లో సురవరం ప్రతాపరెడ్డి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి మాజీ మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తెలంగాణలో కవు లే లేరన్న నిందావ్యాఖ్యాలను సవాలుగా తీసుకొని 354 కవులతో కూడిన గోల్కొండ కవుల సంచిక గ్రంథాన్ని కవుల జీవత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథ రూపంలోనే సమాధానమిచ్చిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అన్నారు. నైజాం నిరంకుశ పాలనలో తెలుగు వారి అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రజలను చైతన్యవంతం చేసేందుకు, తెలంగాణ భాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని కృషి చేసిన మహనీయుడన్నారు. అనంతరం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని మాజీ మంత్రి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌ, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, నందిమళ్ల అశోక్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ, నాగన్నయాదవ్, కంచె రవి, రవిప్రకాశ్‌రెడ్డి, జాతృనాయక్, పరంజ్యోతి, నాగమోని నాగమ్మ, మహేశ్వర్‌రెడ్డి, స్టార్ రహీం, గిరి, సయ్యద్, జమీల్, బలరాం, స్వరాజ్యం, యుగంధర్ రెడ్డి, సురేశ్, ఇమ్రాన్, శ్రీనుతోపాటు పట్టణానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

ఘరానా మోసం

- 204 క్వింటాళ్ల పత్తికి సంబంధించిన రూ.15 లక్షల టోకరా

అలంపూర్, మే 28 : అన్నదాతలను దళారులు ఏదో ఒక రకంగా మోసం చేస్తూనే ఉన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలో దళారుల చేతుల్లో అన్నదాతలు మోసపోయారు. బాధితుల కథనం ప్రకారం అలంపూర్ పట్టణానికి చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి గతేడాది తన పొలంతోపాటు కొంత కౌలుకు తీసుకొని మొత్తం 40 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. గతేడాది గిట్టుబాటు ధరలేక పత్తిని నిల్వ ఉంచుకున్నాడు. ఇదిలా ఉండగా మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన పత్తి వ్యాపారం చేసే దళారి సతీశ్ అలంపూర్‌కు చెందిన రైతు విజయ్‌కుమార్‌రెడ్డి వద్ద నాలుగు లారీల పత్తి నిల్వ ఉందని తెలుసుకొని క్వింటా రూ.7,200 ప్రకారం బేరం మాడాడు. నగదు డబ్బులు లేవని పత్తిని మార్కెట్‌కు తరలించి అమ్మిన తర్వాత డబ్బులు చెల్లిస్తానని నమ్మబలికాడు. ఈనెల 22వ తేదీన ఒక లారీ లోడ్ చేసి రైతును వెంట తీసుకెళ్లి రాయిచూర్ మార్కెట్‌లో పత్తిని అమ్మి సంబంధిత రైతుకు డబ్బులు చెల్లించాడు. మరుసటి రోజు రెండో లారీ లోడ్ చేసే సరికి రాత్రి కావడంతో తెల్లవారు జామున రాయిచూర్ మార్కెట్‌కు వెళ్దామని రైతును నమ్మించాడు. తెల్లవారు జామున రైతుకు తెలియకుండా దళారి లారీతో ఉడాయించాడు. లారీ కనబడకపోవడంతో ఆందోళనకు గురైన రైతు స్నేహితులతో కలిసి పత్తి లారీ కోసం రాయిచూర్ తదితర ప్రాంతాల్లో వెతికాడు. తీరా నాలుగు రోజులకు లారీ ఓనర్, డ్రైవర్ ఇద్దరు కలిసి పత్తిని బళ్లారిలోని ఓ పత్తి మిల్లులో అమ్మినట్లు గుర్తించారు.బాధిత రైతు లారీ ఓనర్,లారీ డ్రైవర్‌ను నిలదీయగా నువ్వు నాకు డబ్బులు బాకీ ఉన్నందుకు మేమే పత్తిని అమ్మి వచ్చిన సొమ్ముతో బాకీ జమ చేసుకున్నామన్నారు. కంగుతిన్న బాధిత రైతు దళారిని పట్టుకొచ్చి న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పి ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణలో ఇదే తరహాలో పదిరోజుల కిందట మానవపాడు మండలం పెద్ద పోతులపాడు గ్రామంలో ఓబులేశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిని కూడా సతీశ్ మోసం చేసినట్లు గుర్తించారు.

ఇప్పటి వరకు ముగ్గురు రైతుల దళారుల నుంచి 204 క్వింటాళ్ల పత్తికి సంబంధించి రూ.15లక్షల వరకు మోసపోయినట్లు గుండెలు బాదుకున్నారు. అయితే పోలీసుల విచారణలో మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది.బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం దళారిపై కేసు నమోదు చేయనున్నట్లు అలంపూర్ ఎస్సై నాగరాజు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కర్ణాటక బస్సు

- ముగ్గురు యువకులు మృతి
- కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే


మృతి చెందిన రాఘవేంద్రాచారి, వెంకటేశ్, మహేశ్ (ఫైల్)

మక్తల్ టౌన్, మే 28 : కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు ఓ బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్నది. ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి వివరాల ప్రకారం మక్తల్ పట్టణంలోని ఎల్లమ్మకుంట, బ్రాహ్మణవాడికి చెందిన రాఘవేంద్రాచారి(30), వెంకటేశ్ (29)లు ఫొటో, వీడియో గ్రాఫర్లుగా పని చేస్తున్నారు. వీరు పంచలింగాలకు చెందిన విద్యార్థి మహేశ్ (18)ను వెంటబెట్టుకొని ఫొటోగ్రఫీ నిమిత్తం మంగళవారం మండలంలోని కాచ్‌వార్ గ్రామానికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు మక్తల్ స్వాగత బోర్డు వద్ద వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాఘవేంద్రాచారి, వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా మహేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే మహేశ్‌ను జిల్లా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాలను మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న యువకుల కు టుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. దవాఖాన ప్రాంగణం అంతా వారి ఆర్తనాదాలతో మార్మోగింది. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్ర భాకర్ చెల్లవాడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రమాద విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే వా కిటి శ్రీహరి మక్తల్ ప్రభుత్వ దవాఖానకు చేరుకొని మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ధై ర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలి : చిట్టెం

బైక్‌పై వెళ్లే ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మంగవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలను ఆయన పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వాహనదారులంతా రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఆర్ఎంపీ వైద్యులకు వైద్యశాఖ హెచ్చరికలు

ప్రైవేట్ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీడీ ఎంహెచ్‌వో

ఆత్మకూరు, మే 28 : అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆర్ఎంపీ దవాఖానలపై వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆత్మకూరులో ఆకస్మికంగా తనిఖీలు చేసిన డిప్యూ టీ డీఎంహెచ్‌వో శ్రీనివాసులు పలు ఆర్ఎంపీ, బీఏఎంఎస్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఆర్ఎంపీ వైద్యులు ఎంబీబీఎస్ వైద్య ల్లా చలామణి అవుతూ ప్రజలను మోసం చేస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఆయన స్పష్టం చేశారు. బీఏఎంఎస్, అల్లోపతి, హోమియోపతి, నెచురోపతి తదితర విభాగాలన్నీ కూడా జిల్లా వైద్యశాఖ పరిధిలోకే వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ అనుమతులు పొంది దవాఖానాలు నిర్వహించాలన్నారు. అనుమతులు పొందడంలో ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పారదర్శకంగా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ తమ అర్హతను బోర్డుపై పెద్ద అక్షరాలతో రాసిపెట్టాలన్నారు. అర్హతను మించి వైద్యం చేయడం, అధిక మోతాదు యాంటిబయాటిక్స్‌తో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. బీఏఎంఎస్ వైద్యులు సిజేరియన్ ఆపరేషన్లు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వైద్యశాఖ నేతృత్వంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో 5 క్లినిక్‌లు, 2 డయాగ్నొసిస్ సెంటర్లు, 2 దవాఖానాలు, 1 స్కా నింగ్ కేంద్రాల్లో తనిఖీలు చేశారు. 1 క్లినిక్ రెన్యువల్ లేని కారణంగా సీజ్ చేసినట్లు ప్రకటించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి వైద్యం చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.